క్లుప్తంగా

కుప్పంనాయుడు ఆదర్శప్రాయుడు



కుప్పంనాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కార్మికులు

బలిజిపేట: కుప్పంనాయుడు ఆదర్శప్రాయుడని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు కొనియాడారు. మండలంలోని పలగర గ్రామానికి చెందిన ఆర్.కుప్పంనాయుడు 13వ వర్ధంతి సందర్భంగా గ్రామంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మన్మథరావు మాట్లాడుతూ ఉన్నతమైన విద్యను అభ్యసించి డాక్టరేట్ అందుకుని వ్యవసాయ కార్మిక సంఘాన్ని మొదటిసారి స్థాపించి దళితులు, గిరిజనులు బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం భూమిని పంచాలని అనేక పోరాటాలు చేసిన వ్యక్తి కుప్పంనాయుడు అని గుర్తు చేశారు. వ్యవసాయ కార్మికుల సమస్యలపై దృష్టిసారించి పోరాటాలు చేసిన గొప్ప వ్యక్తి అని తెలిపారు. అటువంటి వ్యక్తికి నీరాజనాలు సమర్పించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో స్వాములు, నారాయణ, రాము, అప్పడు, గణపతి తదితరులు పాల్గొన్నారు.

మరో బషీరాబాద్ ఉద్యమం తప్పదు

- పట్టణ పౌరసంక్షేమ సంఘం



మాట్లాడుతున్న నాయకులు

సాలూరు: స్మార్ట్‌మీటర్లతో ప్రజలు గొంతు కోయాలనుకుంటే, మరో బషీరాబాద్ ఉద్యమం తప్పదని సాలూరు పట్టణ పౌరసంక్షేమ సంఘం హెచ్చరించింది. ఈ సందర్భంగా ఆగస్టు 28,2000వ సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో భారీగా విద్యుత్‌చార్జీలు పెంచితే పెద్ద ఎత్తున ప్రజలు తిరగబడి చలో హైదరాబాద్ నిర్వహించారని, నాడు ప్రభుత్వం జరిపిన కాల్పులలో బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి అమరులై నేటికి 25 ఏళ్లయ్యాయని తెలుపుతూ వారికి నివాళులు అర్పించారు. నేడు అదానీ స్మార్ట్‌మీటర్లు ప్రజల ఇళ్లకు బిగించి విద్యుత్ భారం పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నాయని మండిపడ్డారు. అధికారంలోకి రాకముందు విద్యుత్‌చార్జీలు పెంచమని చెప్పి నేడు సర్దుబాటు చార్జీల పేరుతో భారం వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎన్వై నాయుడు, అప్పారావు, మణిరత్నం తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీఓ కుమారవర్మ

సీతానగరం: మండలంలోని సచివాలయ ఉద్యోగులు నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వేకార్యక్రమాన్ని నిశితంగా పరిశీలించి వేగవంతం చేయాలని డిప్యూటీ ఎంపీడీఓ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు మండలంలోని ఇప్పలవలస గ్రామంలో ఇంటింటికీ వెళ్తున్న ఇంజినీరింగ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శి, సర్వే సహాయకులు గురువారం నిర్వహించిన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న పక్కా గృహాలు, ఇళ్లస్థలాలు, ఇతర కట్టడాలు, ప్రభుత్వ స్థలాల కొలతలపై అవగాహన కల్పించుకుని నిబంధనలకు లోబడి కొలతలు వేయాలని కోరారు. ఇంటికి సంబంధించిన పొడవు-వెడల్పు, భవనానికి సంబందించిన బుక్ వేల్యూ, ప్రస్తుతం ఉన్న ఇంటి విలువను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సహాయకురాలు చందన, సర్వేయర్ భాను, కార్యదర్శి పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు


కురుపాం/గుమ్మలక్ష్మీపురం: స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుమ్మలక్ష్మీపురంలో ఉన్న మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఈ తనిఖీలు చేయడం జరిగింది. అయితే అధిక ధరకు మద్యం విక్రయాలు జరగనట్లుగా తమ దృష్టికి వచ్చిందని అధికారులు తేల్చిచెప్పారు. ఎవరైనా ఎమ్మార్పీ కన్నా ఎక్కువకు విక్రయిస్తే రూ.5 లక్షల జరిమానా విధించడం జరుగుతుందని, రెండోసారి పట్టుబడి షాపు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని రకాల మద్యం బ్రాండ్‌లు అందుబాటులో ఉంచాల తెలిపారు.

కుక్కల దాడిలో 10 కోళ్లు మృత్యువాత

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీ, విశ్వనాథపురంలో పాడి ప్రసాదరావుకు చెందిన నాటుకోళ్లపై కుక్కలు దాడికి ఎగబడ్డాయి. ఈ ఘటనలో 10 కోళ్లు మృత్యువాత పడ్డాయి. దీంతో రూ.20 వేల వరకు నష్టం జరిగిందని బాధితుడు ప్రసాదరావు వాపోయాడు.



పార్వతీపురం టౌన్: ఇందిరా కాలనీలో గణనాథుడు



పాచిపెంట: మండల కేంద్రంలో మంచు కొండల మాదిరిగా ఏర్పాటు చేసిన మంటపంలో గణనాథుడు



మక్కువ: కుమ్మరి వీధిలో శివలింగంపై వినాయకుడు



సాలూరు: దబ్బి వీధిలో కొలువుదీరిన వినాయకుడు



సీతానగరం: వెలమ వీధిలో కొలువైన గణనాథుడు

ఏకదంతాయ..వక్రతుండాయ శ్రీ గణేశాయ ధీమహి..!

- వివిధ ఆకారాల్లో కొలువుదీరిన గణనాథులు

తెలుగు ప్రజల తొలి పండగ వినాయక చవితిని పురస్కరించుకుని పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాల వ్యాప్తంగా వివిధ రూపాల్లో గణనాథులను కొలువుదీర్చారు. బుధవారం ఉదయం నుంచి భక్తులు, ఉత్సవ కమిటీల పర్య వేక్షణలో రామమందిరాలు, రచ్చబండలు, ప్రత్యేకించి కొబ్బరి కొమ్మలతో తయారుచేసిన మంటపాలపై గణనాథులు కొలువుదీరారు. భక్తులు సమకూర్చిన పూజాసామగ్రిని అర్చకులకు అందచేయగా రెండు పూటలూ పూజలు చేస్తున్నారు. ఒకరోజు వినాయక ఉత్సవాలు నిర్వహించిన నిర్వాహకులు అన్న సంతర్పణ బుధవారం నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో పంచరాత్రులు, మరికొన్ని గ్రామాల్లో నవరాత్రులు నిర్వహించేందుకు గణనాథులను ఏర్పాటు చేశారు. వినాయక ఉత్సవాల సందర్భంగా పలు గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



సీతానగరం: వెన్నెలబుచ్చింపేటలో కొలువుదీరిన పార్వతీతనయుడు



బలిజిపేట: గొల్లవీధి రామాలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయకుని వద్ద కుంకుమార్చన చేసిన భక్తులు



మక్కువ: నెయ్యిల వీధిలో 12 అడుగుల వినాయకుడు



సీతానగరం: ఎయిం ఫర్ సేవా చాత్రాలయం వినియపూజలో పాల్గొన్న స్వామీజీ



పార్వతీపురం టౌన్: మోటపత్తవారివీధిలో అనంత పద్మనాభుని రూపంలో స్వామివారు



సాలూరు: రామా కాలనీలో వినాయకమంటపాన్ని ప్రారంభిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



పార్వతీపురం రూరల్: సంగంవలసలో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు



మక్కువ: కేజీబీవీ పాఠశాలలో వినాయక చవితి పండుగ జరుపుకుంటున్న విద్యార్థులు



సీతానగరం: అంటిపేట కాలనీలో కొలువుదీరిన బొజ్జ గణనాథుడు



బలిజిపేట: బర్లిలో పూజలు చేయిస్తున్న అర్చకులు రాంబాబు



సాలూరు: గొల్ల వీధిలో వినాయకుడు



మక్కువ: అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రంగునాయుడు

విద్యుత్ సరఫరాలో అంతరాయంపై నిరసన



జాతీయ రహదారిపై నిరసన తెలియ జేస్తున్న లచ్చయ్యపేట గ్రామస్తులు

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట గ్రామంలో బుధవారం మధ్యాహ్నం నుంచి రాత్రి 10 గంటలవరకూ విద్యుత్ సరఫరా లేకపోవడాన్ని నిరసించిన ప్రజలు రోడ్డుపై నిరసన తెలియజేశారు. గ్రామానికి బుధవారం మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరా లేదని, పునరుద్ధరించాలని అధికార, ప్రతిపక్షానికి చెందిన గ్రామ నాయకులు బుధవారం సాయంత్రం సంబంధిత అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. అధికారులు పట్టించుకోనందున సాయంత్రం వంటల సమయంలో రాత్రిఇళ్లలో లైట్లు వెలగకపోవడంతో మహిళలు ప్రభుత్వంపై చిర్రుబుర్రులాడారు. అంతలో రాత్రిపూట విద్యుత్‌లేని కారణంగా చీకట్లో దోమల బెడద తట్టుకోలేక గ్రామస్తులు, మహిళలు విసుగుచెంది రాత్రి 9.30 గంటల నుంచి 10.30 గంటలవరకూ ప్రధాన రహదారిపై ఆందోళన చేశారు. అంతలో పోలీసులు రెవెన్యూ అధికారులు స్పందించి విద్యుత్ సిబ్బందిపై తెచ్చిన ఒత్తిడి కారణంగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో రోడ్డుపై స్తంభించిన వాహనాల రాకపోకలు పునరుద్ధరించారు.

ఆరోగ్యకేంద్రాల పరిశుభ్రతపై జాగ్రత్తలు తీసుకోవాలి



పెదంకలాం పీహెచ్‌సీలో మాట్లాడుతున్న స్వచ్ఛాంధ్ర జిల్లా నోడల్‌అధికారి డాక్టర్ టి జగన్‌మోహన్ రావు

సీతానగరం: ఆరోగ్య కేంద్రాల పరిశుభ్రతతో పాటు రోగులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని ఎన్‌సీడీ పీఓ స్వచ్ఛాంధ్ర నోడల్ అధికారి డాక్టర్ తెర్లి జగన్‌మోహన రావు అన్నారు. తన పర్యటనలో భాగంగా గురువారం మండలంలోని పెదంకలాం పీహెచ్‌సీని ఆయన సందర్శించి పీహెచ్‌సీలో రోగుల హాజరు, సిబ్బంది, మందులనిల్వల రికార్డులు, పీహెచ్‌సీ భవనం ప్రాంగణంలో స్వచ్ఛతా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ అనారోగ్యానికి గురైన వారు ఇక్కడ మెరుగైన వైద్య సేవలు పొందవచ్చని నమ్మకంతో వస్తున్న రోగులకు మెరుగైన సేవలందించాలని సూచించారు. అలాగే స్వచ్ఛాంధ్రలో భాగంగా పీహెచ్‌సీ ప్రాంగణంలోని ఆస్పత్రిలో స్వచ్ఛత పాటించాలని ఆదేశించారు. అనంతరం కుక్కకాటు, పాముకాటు, అత్యవసర మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెడికల్‌ల్యాబ్‌ను, మందులిచ్చే గదులను పరిశీలించారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ పి.రమ్యసాయి అధ్యక్షతన సిబ్బందితో సమీక్షా సమావేశం జరిగింది. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గోపాలరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

క్లస్టర్ సమావేశానికి హాజరుకావాలి



తుమరాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల నోట్ పుస్తకాలు పరిశీలిస్తున్న ఎంఈఓ-1సామల

బలిజిపేట: ఈనెల 30న నిర్వహించనున్న క్లస్టర్ సమావేశాలకు ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంఈఓ-1సామల సింహాచలం తెలిపారు. ఈ మేరకు తుమరాడ ప్రాథమిక పాఠశాలను ఆయన గురువారం పర్యవేక్షించారు. ఎసెస్మెంట్ పుస్తకాలను పరిశీలించి మూల్యాంకన ప్రక్రియను వెంటనే పూర్తిచేసి మార్కులను ఆన్‌లైన్ చేయాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థుల ఆంగ్ల, తెలుగు పుస్తకాల పఠన విధానాన్ని పరిశీలించారు. రాత, చదువుపై దృష్టి సారించాలని సూచించారు. మంచి చేతిరాత ఉండేవిధంగా చూడాలని చెప్పారు. పాఠ్యాంశాల బోధనలో ఉపాధ్యాయులు నూతన బోధనా విధానాలను అమలు చేయాలన్నారు. అదేవిధంగా పెదపెంకి-1పాఠశాలను ఎంఈఓ-2కె.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. మధ్యాహ్న భోజన పథకం అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు బడిదేవరమ్మపై భక్తి, రైతులపై అనురక్తి

- ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. కృష్ణమూర్తి



పార్వతీపురం రూరల్: ఇప్పటి వరకు గ్రానైట్ తవ్వకాలకు వెన్నుదన్నుగా నిలిచిన పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు బడిదేవరమ్మపై భక్తి, రైతులపై అనురక్తి వెనుకన్న రహస్యం ఏమిటని, ప్రజలకు ఎమ్మెల్యే మనస్సులో ఉన్న నిజాన్ని చెప్పాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి విలేకరులసమావేశంలో డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ బడిదేవర కొండపై మైనింగ్ తవ్వకాలకు మరోసారి ప్రజాభిప్రాయం తీసుకోవాలని ఎమ్మెల్యే మాట్లాడడం పచ్చిమోసమని, ఇంతవరకు జరిగిన తవ్వకాలు ప్రజాభిప్రాయంతోనే జరిగాయని ఎమ్మెల్యే నమ్మించడం ద్రోహమని కృష్ణమూర్తి ధ్వజమెత్తారు. అప్పుడు కానీ, ఇప్పుడు కాని బడిదేవరమ్మ కొండపై గ్రానైట్ తవ్వకాలు ప్రజాభిప్రాయం లేకుండానే జరుగుతున్నాయని మండిపడ్డారు.

ప్రజాభిప్రాయం తీసుకోకుండా గ్రానైట్ లైసెన్సులు ఎలా ఇస్తారని 2016లో ప్రజా సంఘాలు పోరాటం చేయడం, రిజర్వ్‌ఫారెస్ట్‌లో మైనింగ్ లైసెన్స్ ఇవ్వడాన్ని ఫారెస్టు అధికారుల అభ్యంతరం వల్ల హైలెవెల్ కమిటీ వేశారని, ఆ కమిటీ నివేదికతోనే కొండకు రక్షణ కలిగిందన్నారు. ఈ సందర్భంగా గ్రానైట్ తవ్వకాలకు వెన్నుదన్నుగా నిలిచిన ఎమ్మెల్యేకు బడిదేవరమ్మపై భక్తి, రైతులపై అనురక్తి ఎప్పుడో కలిగిందో?'' అని ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు.

విద్యుత్ సంస్కరణ చట్టాలు రద్దు చేయాలి

- వామపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ



పార్వతీపురం పట్టణంలో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న వామపక్ష నాయకులు

పార్వతీపురం టౌన్: విద్యుత్ సంస్కరణ చట్టాల అమలుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంబానీ ఆదానీలకు ప్రజల సంపదను అంటగట్టే ప్రయత్నం చేస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు అన్నారు. విద్యుత్ ఉద్యమానికి 25 ఏళ్లు నిండిన సందర్భంగా గురువారం స్థానిక సుందరయ్య భవనం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమరుల త్యాగాల స్ఫూర్తి కోసం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనునాయుడు, భాస్కరరావు, సీపీఐ జిల్లా నాయకులు ఆర్.వి.ఎస్.కుమార్, సింహాద్రి, సత్యనారాయణ, సిపిఐ(ఎంఎల్) రెడ్ స్టార్ నాయకులు బి.సూరయ్య, సిపిఐఎంఎల్ న్యూ లిబరేషన్ నాయకులు పి.సంగం, గిరిజన సంక్షేమ సంఘం రంజిత్ కుమార్, ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, ఎం.ఉమామహేశ్వరీ, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు రెడ్డి వేణు, వి. చిన్నంనాయుడు, ఏపీ రైతు సంఘం నాయకులు పక్కి రవీంద్ర, పి.అప్పారావు, సంత్యనారాయణ మరియు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యమంలో అమర వీరులకు నివాళి



విద్యుత్ ఉద్యమ అమరవీరులకు నివాళులర్పించి, ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజలు

బలిజిపేట: ప్రజలకు నష్టం కలిగించే విద్యుత్ సంస్కరణలను, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బలిజిపేటలో సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యమానికి, అమరవీరుల త్యాగానికి 25సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వారి స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మన్మథరావు మాట్లాడుతూ 2000వ సంవత్సరంలో ఇదే రోజున పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఆనాటి టీడీపీ ప్రభుత్వం పోలీసులతో జరిపించిన కాల్పుల్లో పలువురు వీరమరణం పొందారని గుర్తు చేశారు. ఆనాటి నుంచి సంస్కరణలు పెంచుతూ ప్రజలపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపారన్నారు. కార్పొరేట్ కంపెనీలకు మీటర్లు అప్పగించి విద్యుత్ చార్జీలు పెంచడం అన్యాయమన్నారు. స్మార్ట్ మీటర్లపై జరిగే నష్టాన్ని ప్రజలకు వివరించి ప్రజలను చైతన్య పరిచేందుకు మీటర్లు తిరస్కరించేందుకు సన్నద్ధం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కృష్ణ, మజ్జి, అప్పలస్వామి, లక్ష్మమ్మ, సత్యవతి, సన్యాశి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో యూరియా కొరత

- కలెక్టరేట్ వద్ద రైతు సంఘాల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

పార్వతీపురం రూరల్: జిల్లాలో యూరియా, ఎరువుల కొరత తీవ్రస్థాయిలో రైతులను వేధిస్తోందని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. కృష్ణమూర్తి అన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ వద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా ఉన్నతాధికారులు ఒకే పాఠం బోధిస్తూ రైతులకు మోసం చేస్తున్నారని విమర్శించారు. యూరియా కొరతతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, ప్రభుత్వం అందించే యూరియా సరిపోకపోవడంతో బయట ప్రైవేట్ మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం యూరియా కొరతను కప్పిపుచ్చుకునేందుకు యూరియా, ఫాస్ఫేట్‌కు బదులు నానో యూరియా ఎరువులు, గుళికలను కొనుక్కోవాలని రైతులపై సంబంధిత అధికారులు ఒత్తిడిచేస్తున్నారన్నారు. ఇది చాలా అన్యాయమని మండిపడ్డారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మంనాయుడు, ఉపాధ్యక్షుడు బంటు దాసు, ఆర్.రాము, రెడ్డి రమణమూర్తి, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.